నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 హైదరాబాద్, బుధవారం 20 మార్చి 2024 SANGAREDDY


రామాయంపేటలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ


మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో వడగండ్లకు నేలకొరిగిన మొక్కజొన్న పంట

# అన్నదాత ఆగమాగం

అకాల వర్షం అన్నదాతలను ఆగమాగం చేస్తున్నది. ఇటీవల ఎండలకు నీళ్లు లేక పంటలను ఎంతో కష్టపడి కాపాడుకుంటున్న రైతులకు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కన్నీటి బాధలు విగుల్చుతున్నాయి. 'మూలిగే నక్కపై తాటిపండు పడింది'.. అన్న చందంగా కరెంట్ కోతలు, అడుగంటిన భూగర్భ జలాలతో సాగుకు ఇబ్బంది పడుతున్న కర్షకులపై ఈ నష్టం వారిని అప్పుల్లోకి నెట్టివేసింది..

భారీగా ఈదురు గాలులు, అకాల వర్షాలు

వందలాది ఎకరాల్లో పంట నష్టం

రైతులకు తప్పని కన్నీటి బాధలు

తక్షణమే పంటనష్టం అంచనా వేసి పరిహారం అందించాలని డిమాండ్

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి : తన్నీరు హరీశ్‌రావు


సంగారెడ్డి జిల్లా మండలంలోని రుక్మాపూర్ గ్రామ శివారులోని మామిడి తోటలో ఈదురుగాలులు, వడగండ్ల వానకు నేలపాలైన మామిడి కాయలను పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు

సిద్దిపేట, మార్చి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిన్న మొన్నటి వరకు అప్రకటిత కరెంట్ కోతలు, భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయాయి. ఈదురు గాలులు, అకాల వర్షాలతో రెండు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పంట చేతికందే సమయంలో వడగండ్ల రూపంలో పంటలు దెబ్బతినడంతో రైతులు బోరున విలపిస్తున్నారు. యాసంగి పంటను కాపాడుకోవడానికి రైతులు భగీరథ ప్రయత్నాలు చేసి రక్షించుకుంటున్నారు. నీళ్లు లేక, వచ్చిపోయే కరెంట్‌తో మోటర్లు కాలడం తదితర ప్రతికూల పరిస్థితుల మధ్య రైతులు కొట్టు మిట్టాడుతున్నారు. ఇదే సమయంలో వడగండ్ల వానతో ఉన్న పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా వరి, మొక్కజొన్న, మామిడి తోటలతో పాటు ఇతర పంటలకు భారీగా నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రైతుల పంటల నష్టం అంచనా వేయడంలో విఫలమవుతున్నారు. ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో వర్షం పడింది.

### వందలాది ఎకరాల్లో పంటలకు నష్టం

సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల్లో వడగండ్ల వర్షం పడింది. మెదక్ జిల్లాలోని వెల్దుర్తి, చిన్నశంకరంపేట, రామాయంపేట, నార్సింగి, చేగుంట మండలాల్లో కురిసిన వడగండ్లకు పంటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాల్లో చేతి కొచ్చే పంట అందకుండా పోయింది. తక్షణమే వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### కలిసి రాని యాసంగి

ఈసారి యాసంగి సాగు ఆరంభం నుంచి రైతులకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో సాగుకు ముందే పెట్టుబడి సాయం కింద రైతుబంధు అందించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు పూర్తిస్థాయిలో రైతుబంధు ఇవ్వలేదు. దీంతో రైతులు అప్పులు తెచ్చి పంటలు వేశారు. పంట చివరి దశలో సాగునీరు అందక, కరెంట్ కష్టాలతో పంటలు ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల పశువులు మేపుతున్నారు. ఎండిపోగా మిగిలింది చేతికి వస్తుందనుకుంటే వడగండ్ల రూపంలో పంటలకు నష్టం జరిగిందని, రైతులు బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వం తమకు పంట పెట్టుబడి సాయం ఇవ్వడంతో పాటు నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

## రైతులను ఆదుకోవాలి

సహాయక చర్యల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు భాగస్వాములు కావాలి


టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మార్చి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అకస్మాత్తుగా కురిసిన వడగండ్ల వల్ల పంటలు దెబ్బతిని రైతులు బాధలో ఉన్నారని, వెంటనే మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి పంటనష్టాన్ని అంచనావేసి రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాలన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు కూడా ప్రజల్లోకి వెళ్లి నష్టపోయిన రైతులకు ధైర్యం చెప్పాలని సూచించారు. మంగళవారం రాత్రి ఢిల్లీ నుంచి సిద్దిపేట మున్సిపల్, రెవెన్యూ అధికారులు, బీఆర్‌ఎస్ శ్రేణులతో ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాళ్ల వాన కురవడంతో జరిగిన నష్టంపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కూలిన ఇండ్లు, రాలిన మామిడి పంటలు, నేలకొరిగిన మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. సిద్దిపేట పట్టణంలో విద్యుత్‌ను వెంటనే పునరుద్ధరించాలని, కూలిన స్తంభాల వద్ద మరమ్మతులు చేపట్టాలన్నారు. కౌన్సిలర్లు వార్డుల్లో పర్యటించి ప్రజావసరాలను గుర్తించి అందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పూర్తిగా కూలిపోయిన ఇండ్లకు రూ.లక్ష సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిర్వాసితులైతే వారికి బస, భోజనం ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రూరల్ మండలంలోని పుల్లూరు, వెంకటాపూర్, బుస్సాపూర్, తడకపల్లి, చిన్నకోడూరు మండలంలోని పెద్దకోడూరు, చంద్లాపూర్, చౌడారం తదితర గ్రామాల్లో పంట నష్టం తీవ్రంగా ఉన్నదని, వెంటనే వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యానవన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు నష్టపోయిన పంటలు, తోటలను పరిశీలించి నష్టం అంచనాలు ప్రభుత్వానికి పంపాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేలు వెంటనే పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.


సిద్దిపేట పట్టణంలో ఈదురుగాలకు విరిగి రోడ్డుపై పడిన చెట్లు


సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పుర హనుమాన్ టెంపుల్ వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం


మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

## రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

నిజాంపేట, మార్చి19: వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం చెల్లించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం నిజాంపేటతోపాటు బచ్చురాజ్‌పల్లి, తిప్పనగుల్ల గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించి, బాధిత రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నదాతలకు ప్రభుత్వం చేయూత ఉండేదన్నారు. నిజాంపేట మండలంలో 2 వేల ఎకరాల మేర పంట నష్టం వాటిల్లిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఎకరాకు రూ.10 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ నిలబడి ధర్నాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆయనవెంట ఎంపీపీ సిద్ధిరాములు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు అమరసేనారెడ్డి, గేమ్‌సింగ్, మాజీ ఎంపీపీ సంపత్, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గౌస్, సోషల్ మీడియా మండలాధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నాయకులు నరేందర్, యాదగిరి, పత్తినాయక్, రంజిత్‌గౌడ్, రైతులు సుధాకర్, సిద్ధిరాములు, లక్ష్మణ్, యాదగిరి, నరేశ్, సుజాత, మణెమ్మ తదితరులు ఉన్నారు.


మెదక్ జిల్లా బచ్చురాజ్‌పల్లిలో దెబ్బ తిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

## చిన్నారిని మింగిన గాలిదుమారం

రాజిపేట జాజితండాలో

ఈదురుగాలులకు రేకులతో సహా ఎగిరిపోయిన చిన్నారి మృతి

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి, మార్చి 19: ఈదురు గాలులకు ఇంటి పైకప్పు రేకులతోపాటు ఆరేండ్ల చిన్నారి సంగీత ఎగిరిపోయి పక్కింటి స్లాబ్‌పై పడింది. దీంతో గాయాలైన చిన్నారికి దవాఖానలో చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం రాజిపేట జాజితండాలో చోటు చేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మంజుల, మాన్సింగ్ దంపతులకు సంగీత, సీత అనే కవలలు ఉన్నారు. సంగీత (6) ఒకటో తరగతి చదువుతుంది. సోమవారం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా, నానమ్మతో కలిసి సంగీత, సీత ఇంట్లోనే రేకులకు ఉయ్యాల కట్టుకుని ఆడుకుంటూ ఉన్నారు. కొద్దిసేపటికి నాన్నమ్మ, సీత ఇద్దరూ పక్కింట్లోకి వెళ్లారు. అంతలోనే భారీ గాలిదుమారం వచ్చి, రేకులతోపాటు చిన్నారి సంగీత ఎగిరిపోయి రెండు ఇండ్ల తర్వాత ఉన్న స్లాబ్‌పై పడింది. ఇది గమనించిన స్థానికులు తీవ్రగాయాలతో పడిఉన్న చిన్నారిని 108లో నర్సాపూర్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం సంగీత మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

బాధిత కుటుంబాన్ని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబానికి తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆయనవెంట బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సార రామాగౌడ్ తదితరులున్నారు. మాలోత్ సంగీత కుటుంబాన్ని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ తండాలో పరామర్శించి, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ పరంగా ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట గిరిజన విద్యార్థి సంఘం నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు శివాజీ నాయక్, స్థానిక తాజా మాజీ సర్పంచ్ రమేశ్, వాల్యా నాయక్, మహేశ్, రాజు, రాకేశ్, గోపి, పాండు, గేమ్యా నాయక్, సూర్య, శీను ఉన్నారు.


పరామర్శిస్తున్న నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి




నిజాంపేటలో పంట పొలాలకు వెళ్లే దారిలో ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు, నస్కల్‌లో గాలి దూమారానికి రేకులు ఎగిరిపోయి నిరాశ్రయుడైన వడ్ల నర్సింహులు, రామాయంపేటలో నేలరాలిన మామిడి పిందెలు

## కడగండ్లు మిగిల్చిన వడగండ్లు


రాళ్లవానతో రాలిన మామిడి

నేలకొరిగిన మొక్కజొన్న పంట

కూలిన చెట్లు.. విరిగిన కరెంటు స్తంభాలు

సిద్దిపేట/ హుస్నాబాద్/ బెజ్జంకి, మార్చి 19: వడగండ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చింది. మంగళవారం సాయంత్రం భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. సిద్దిపేట పట్టణంతో పాటు నియోజకవర్గంలోని చిన్నకోడూరు, సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. బలమైన ఈదురు గాలులతో వృక్షాలు కూలిపోయాయి. వర్షం కురవడంతో రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చిన్నకోడూరు మండలంలోని చంద్లాపూర్, పెద్దకోడూరులో మామిడి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం జరిగింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు కూలడంతో సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు సిద్దిపేట పట్టణం అంధకారంలో ఉండాల్సి వచ్చింది. హుస్నాబాద్ పట్టణంతో పాటు డివిజన్‌లోని పలు మండలాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. బెజ్జంకి మండల పరిధిలో తీవ్ర గాలిదుమారంతోపాటు ఉరుములు, మెరుపులతో వాడగండ్ల వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి.


సిద్దిపేట పట్టణంలో కురిసిన వడగండ్లు


సిద్దిపేట ఒకటో వార్డులో పెనుగాలులకు ఎగిరిపడిన రేకులషెడ్డు


సిద్దిపేట 33వ వార్డులో రోడ్డుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం


సిద్దిపేట పట్టణంలో ఈదురుగాలకు నేలకొరిగిన చెట్లు

## హామీల అమలు గేట్లు తెరవండి

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ముందు అమలు చేయండి

పంటలు దెబ్బతింటే పట్టించుకోరా..?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చురకలు

సంగారెడ్డి, మార్చి19: పార్టీ ఫిరాయింపులకు గేట్లు తెరవడం మాని, ఎన్నికల హామీల అమలుకు కృషిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చురకలంటించారు. మంగళవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంటు ఎన్నికలకు ముందే హామీల అమలుకు కార్యాచరణ సిద్ధం చేయాల్సి ఉండగా, ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకు కాలయాపన చేసి ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు మహాలక్ష్మి పథకంలో నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని మాటతప్పిందని ఎద్దేవా చేశారు. అన్నదాతలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితిలో రైతులు లేరని, రైతు భరోసాతో ఎకరానికి రూ.15వేల చొప్పున పెట్టుబడి సాయం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కౌలు రైతులకు రూ.12వేలు ఇస్తామని, ఇంత వరకు ఎలాంటి ప్రక్రియ మొదలుపెట్టలేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.4 వేల పింఛన్, వరికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి చెయ్యిచ్చారని విమర్శించారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, ఉద్యోగులకు డీఏ లేదని, నిరుద్యోగలకు భృతి లేదన్నారు. కేసీఆర్ పాలనలో పచ్చని పంట పొలాలు ఉంటే, కాంగ్రెస్ పాలనలో పంటలకు మంటలు పెట్టుకునే పరిస్థితి దాపురించిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పార్టీ మారితే రాళ్లతో కొట్టి చంపండి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

### రైతులను ఆదుకోవాలి

వడగండ్లకు పంటలు నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు, మూడు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని, వర్షంతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. రాజకీయాలు మాని రైతులను ఆదుకోవడంపై ప్రభుత్వం దృష్టిసారించాలని హితవు పలికారు. సమావేశంలో కో-ఆప్షన్ సభ్యుడు గోవర్ధన్ నాయక్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, నాయకులు కాసాల రాంరెడ్డి, కసిని శ్రీకాంత్, కుమార్, దిడ్డి విఠల్, వెంకటేశం తదితరులున్నారు.


సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్